

శరవేగంగా రథసప్తమి ఉత్సవాల ఏర్పాట్లు

శ్రీకాకుళం అర్బన్ : రథసప్తమి ఉత్సవాల నేపథ్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్రపుష్కరిణి పరిసరాల్లో చేపడుతున్న నిర్మాణ పనులను నగరపాలక సంస్థ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. రథసప్తమి ఉత్సవాలు రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో యాత్రికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇఇ భద్రాజీ, మున్సిపల్ ఎంఇ దక్షిణామూర్తి, ఎండోమెంట్ సర్వేయర్ దుర్గాప్రసాద్, ఎండోమెంట్ జెఇ టి.చందన, మున్సిపల్ సర్వేయర్ జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సహకార నకిలీ సభ్యత్వాలపై సర్వే

- రైతుల సభ్యత్వాలకు ఇకెవైసి అనుసంధానం
- సచివాలయాలకు బాధ్యతలు అప్పగింత
- భూములు లేని వారికి ఓటు హక్కు రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సహకార సంఘాల్లో నకిలీ సభ్యత్వాల ఏరివేతపై ప్రభుత్వం దృష్టిసారించింది. అందులో భాగంగా సభ్యత్వాలు ఉన్న రైతుల భూములతో పాటు సభ్యత్వాలను ఇకెవైసితో అనుసంధానించడం ద్వారా అసలు, నకిలీ సభ్యత్వాలను గుర్తించనున్నారు. ఈ బాధ్యతలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అప్పగించారు. సహకార శాఖ పర్యవేక్షణలో చేపడుతున్న ఈ ప్రక్రియ ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనివల్ల సహకార బ్యాంకుల్లో బినామీలను గుర్తించడం సాధ్యమవుతుందని ప్రభుత్వ అంచనా. సాగు భూమి ఉన్న వారికే సభ్యత్వాలు చెల్లుబాటు కానున్నాయి. గతంలో గ్రామస్థాయిలో రాజకీయ లబ్ధి కోసం, ఓటు హక్కు కోసం భూములు లేకపోయినా, పలువురు సభ్యత్వం తీసుకుని బినామీ రుణాలు పొందినట్టు పలుమార్లు గుర్తించడమైంది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు లేకుండా పర్సన్ ఇన్‌ఛార్జీలుగా పార్టీ నాయకులకు పదవులు కేటాయించారు. ఆ సమయంలో ఎన్నికలు రావచ్చని భావించి కొందరు సభ్యులుగా చేరారు. సంఘాల పరిధిలో నకిలీ డాక్యుమెంట్లతో భూమి లేని వారు కూడా ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో రుణాలు పొందినట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇకెవైసి అనుసంధానించడానికి క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్నారు.

ఇక నుంచి డిజిటలైజేషన్

జిల్లావ్యాప్తంగా 50 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉండగా, వాటి పరిధిలో 17,77,402 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. 2013 ఎన్నికల్లో కేవలం 1,10,761 మంది సభ్యులు మాత్రమే సహకార ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పూర్తిస్థాయిలో సభ్యులుగా కొనసాగుతున్న వారిలో అసలు, నకిలీ గురించాల్సిన అవసరం ఏర్పడింది. కేవలం రుణాలు పొందడానికి కొందరు సభ్యులుగా కొనసాగుతున్నారు. అనేక మంది మృతి చెందిన వారి పేర్లు ఇంకా సభ్యులుగా కొనసాగుతున్నాయి. 11 ఏళ్లు గడచినా ఇంతవరకు ఎన్నికలు జరగలేదు. వీటన్నింటినీ గుర్తించేందుకు ఇకెవైసి అనుసంధాన ప్రక్రియ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న రైతుల వివరాలు ఇకెవైసి చేసే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అప్పగించారు. సహకార సిబ్బంది నేరుగా సభ్యులకు ఫోన్లు చేసి వివరాలు తెలుసుకుంటున్నారు. ఇకెవైసి అనుసంధానించిన తర్వాత నేరుగా రైతు సెల్‌ఫోన్‌కే ఒటిపి వస్తుంది. ఆ ఒటిపి ఆధారంగా సభ్యులుగా డిజిటల్‌లో రిజిస్టర్ అవుతున్నారు. భూములు ఉన్న రైతులు మృతి చెందితే, వారి వారసులకు భూములు వారసత్వంగా సంక్రమిస్తాయి. మృతి చెందిన రైతులు మాత్రం ఇంకా సహకార సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. వారి స్థానంలో వారసులకు సభ్యత్వం మార్చడం లేదు. భూములు కొనుగోలు చేసిన వారు మ్యుటేషన్ చేసుకోక, రికార్డుల్లో పేర్లు మార్చుకోకపోవడంతో విక్రయదారులు ఒటిపిలు చెప్పడం లేదు. ఉద్యోగులకు విక్రయం ద్వారా భూముల బదలాయింపు జరిగి ఉంటే, వారు ఇకెవైసి చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆధార్‌తో అనుసంధానిస్తూ ఇకెవైసి ఆన్‌లైన్ చేసే కార్యక్రమం జిల్లావ్యాప్తంగా మొదలైంది. వాటిని డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా కంప్యూటర్లలో నిక్షిప్తం చేయనున్నారు. ఇంతకాలం రికార్డులకే పరిమితమైన రైతుల వివరాలు, ఇక నుంచి డిజిటలైజేషన్ పద్ధతిలో కంప్యూటరీకరణ చేయనున్నారు.

బినామీలు చెల్లవు

ఇకపై బినామీ సభ్యత్వాలు చెల్లుబాటు కావు. రైతుల రుణాలు, వడ్డీ వివరాలు తెలుసుకునేందుకు సంఘాల కార్యదర్శులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. బ్యాంకు, రైతుల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. డిజిటలైజేషన్ పూర్తయితే రైతులు తమ బ్యాంకు ఖాతా లాగిన్ కాగానే లావాదేవీల వివరాలు ఫోన్‌లోకి వస్తాయి. వడ్డీతో కలిపి రుణం ఎంత చెల్లించాలి..?, డిపాజిట్‌పై ఇప్పటివరకు వడ్డీ ఎంత జమైంది...?, నగదు నిల్వ వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు.

ఇకెవైసి తప్పనిసరి



జిల్లాలోని సహకార పరపతి సంఘాల్లో సభ్యులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలి. ప్రభుత్వం అందించే రాయితీలు, బ్యాంకు ద్వారా రైతులకు రుణాలు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్తాయి. సంఘాల్లో రుణాలు, వడ్డీ తదితర వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు.

- బి.నగేష్ , జిల్లా సహకార శాఖ అధికారి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైందని చెప్పారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ కూర్చొని వేడుకలను వీక్షించేందుకు సరిపడా సౌకర్యవంతమైన సీట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రజలు, ఆహ్వానితుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి పోలీసు అధికారులను ఆదేశించారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసారి ప్రత్యేకంగా స్టాల్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, డిఎస్‌డిఒ శ్రీధర్, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అపరిష్కృతంగా ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎఎస్‌పి కె.వి రమణతో కలిసి డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై కేసులు, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసులు, హిట్ అండ్ రన్ కేసులపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలన్నారు. పెండింగ్ గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా అభియోగ పత్రాలు కోర్టులో దాఖలు చేయాలని ఆదేశించారు. పోక్సో వంటి కేసుల్లో కేసు నమోదు నుంచి ఛార్జ్‌షీట్ దాఖలు వరకు సాక్ష్యాధారాల సేకరణ, విచారణ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ఇప్పటివరకు నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలు, దర్యాప్తు గురించి ఆరా తీశారు. కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించడంలో అలసత్వం వహించరాదన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హిట్ అండ్ రన్ కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై ఆరా తీసి, ప్రమాదాలకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సదురు కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం, భౌతిక ఆధారాలు సేకరించి ప్రమాదానికి గురైన సంబంధిత వాహనాన్ని గుర్తించాలని సూచించారు. టోల్ గేట్లు, ముఖ్య కూడళ్లలో కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసు దర్యాప్తు పూర్తి చేసి నిర్ణీత సమయంలో ఛార్జ్‌షీట్ కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. ప్రమాదాలు సంభవించే ప్రదేశాలను గుర్తించి డ్రమ్స్, స్పీడ్ బ్రేకర్స్, రేడియం స్టిక్కర్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు.



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే శిరీష, వెంకన్న చౌదరి

రక్తదానానికి ముందుకు రావాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విశాఖపట్నం ఎన్‌టిఆర్ ట్రస్టు, శ్రీకాకుళం రిమ్స్, టెక్కలి ప్రభుత్వాస్పత్రి, కాశీబుగ్గ ప్రాణదాత, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి లోకేష్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ఎంతోమందికి సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి పరిస్థితి ఏర్పడకుండా యువత రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుకోవచ్చని చెప్పారు. రక్త నిల్వలు లేకపోవడంతో ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, రక్తం దానం చేయడం ద్వారా మరో ప్రాణం కాపాడినట్లవుతుందన్నారు. ప్రతి వ్యక్తి ఆరు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని చెప్పారు.

రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తం తయారవుతుందని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. రక్తదాన శిబిరంలో 738 మంది పాల్గొని రక్తదానం చేశారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్ రావు, నాయుకులు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయగౌరి

విజయగౌరిని గెలిపించుకోవాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ సమస్యలపై చట్టసభల్లో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరం మున్సిపల్ హైస్కూల్, ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్, పిఎస్ఎన్ఎం స్కూల్, అరసవల్లి, చేపలవీధి పాఠశాలల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించాలని కోరారు. సుదీర్ఘకాలం పాటు విజయగౌరి ఉపాధ్యాయ ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి మాట్లాడుతూ చట్టసభల్లో సమస్యలపై ప్రస్తావిస్తూ, పోరాడుతూ వాటి పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి, పరిష్కరించేందుకు తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాష్, టి.వైకుంఠరావు, ఎం.గోవిందరావు, శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామ రహదారులకు మహర్దశ

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ

గిరిజన గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గిరిజన గ్రామాల రహదారుల పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారుమూల గ్రామాలతో పాటు గిరిజన గ్రామాలకు సైతం పక్కా బి.టి రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని గిరిజన గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయడమైందని చెప్పారు. వీటిని త్వరగతిన పూర్తి చేస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గతుకులు లేని రోడ్లను చూస్తామన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోని రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, ఎంపిపి కె.దీప, ఎంపిడిఒ తిరుపతిరావు, టిడిపి మండల అధ్యక్షులు వి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

పోక్సో కేసులో యువకుడు అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన రణస్థలం మండలం బంటుపల్లికి చెందిన యువకుడు నారు ప్రసాద్‌ను పోక్సో కేసులో అరెస్టు చేసినట్లు డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ప్రసాద్ ఈనెల 13వ తేదీన చిన్నారులతో కలిసి ఆడుకుంటున్న బాలికకు తినుబండారాలు ఇచ్చి సచివాలయం మేడ పైకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. కొద్దిరోజుల తర్వాత బాలిక మర్మావయం వద్ద నొప్పిగా ఉన్నట్లు ఆమె పిన్నితో చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారని చెప్పారు. బాలిక స్నేహితురాళ్లను విచారించడంతో బాలికను ప్రసాద్ తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈనెల 20న బాలిక కుటుంబ సభ్యులు జె.ఆర్ పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి పోక్సో కేసు కావడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. డిఎస్‌పి వివేకానంద కేసు విచారణ చేసి నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు. నిందితునిపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలు ఉన్నట్టు గుర్తించామన్నారు. సమావేశంలో జె.ఆర్ పురం ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గార, శ్రీకాకుళం రూరల్ మండలాల ప్రజల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు. ప్రజా దర్బార్‌లో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి అధికంగా వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలకూ నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేరోజులో వేలాదిగా గ్రామసభలు నిర్వహించి పల్లెల్లోని సమస్యలను గుర్తించామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఆయా సమస్యల పరిష్కారానికి పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపనలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంటోందన్నారు. సామాజిక సమస్యలు గానీ, వ్యక్తిగత సమస్యలు గానీ తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వినతుల స్వీకరణలో ఆయనతో పాటు శ్రీకాకుళం, గార మండలాల నాయకులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ ప్రచారం తగదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజల్లో మూఢనమ్మకాన్ని కలిగించే రీతిలో అశాస్త్రీయతను మద్రాస్ ఐఐటి డైరెక్టర్ డాక్టర్ కామకోటి ప్రచారం చేయడం తగదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గో మూత్రం తాగితే జ్వరం నయమవుతుందని, అప్పుడప్పుడూ తీసుకోవాలని, అతి పెద్ద ఔషధమన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శరీరానికి హాని కలిగించే బ్యాక్టీరియాలకు వ్యతిరేకంగా పోరాడే శక్తి గోమూత్రానికి ఉందని చెప్పడం అశాస్త్రీయమని తెలిపారు. వైద్యపరంగా రుజువు కాని అంశాన్ని దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మద్రాస్ డైరెక్టర్ ప్రచారం చేయడం సరికాదన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తున్న ఐఐటి మద్రాస్ డైరెక్టర్ ఇటువంటి అశాస్త్రీయ భావనలను వ్యక్తం చేయడం తగదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ(హెచ్) ప్రకారం శాస్త్రీయ దక్పథ ప్రచారాన్ని చేయాల్సింది పోయి అశాస్త్రీయ భావనలను ప్రచారం చేయడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. తక్షణమే ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

రికార్డులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి- పొందూరు

నాడు-నేడు పనులు జరిగిన పాఠశాలల్లో నాడు- నేడు పనులకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచాలని ఆదేశించడం జరిగిందని శ్రీకాకుళం డిప్యూటీ డిఇఒ ఆర్. విజయకుమారి అన్నారు. మండలం లోలుగు జెడ్‌పి ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. నాడు-నేడు జరిగిన పాఠశాలల్లో సామాజిక తనిఖీలు జరుగు తున్నాయని సంబంధిత పాఠశాలల్లో తనిఖీల నాటికి రికార్డులన్నీ విధిగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టిఐఎస్ శతశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. పాఠశాలలో రికార్డులను ఆమె పరిశీలించారు. ఈమెతో పాటు ఎంఇఒ-2 పి.రాజారావు, హెచ్‌ఎం సంజీవిరావు ఉన్నారు.

బ్రెయిన్ కేన్సర్‌తో చిన్నారి పోరాటం

దాతల కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్



వర్ధన్

మండలంలోని నెలివాడ పంచాయతీకి చెందిన ఎందువ అప్పలనాయుడు, దమయంతి దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమార్తె ఎందువ హనీ 4వ తరగతి చదువుతుంది. బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతున్న ఎందువ వర్ధన్‌కు 5 సంవత్సరాలు. ఒకరోజు అంగన్వాడీ కేంద్రం నుంచి ఇంటికి వచ్చిన తర్వాత వర్ధన్ నీరసంతో ఉన్నాడని ఆస్పత్రికి తీసుకువెళ్లగా బ్రెయిన్ కేన్సర్ అని తెలిసింది. విశాఖలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సుమారు 3 నెలలు ఉండి వైద్యం అందించినా వ్యాధి ముదిరిందే కానీ నయంకాలేదు. ఆర్థికంగా నిరుపేద కుటుంబం అయినప్పటికీ వ్యాధి బారినుంచి తప్పించేందుకు పట్టణాల్లో అనేక ఆస్పత్రుల్లో చేర్పించి వైద్యం చేయించినా వ్యాధి నయంకాని పరిస్థితి. తండ్రి అప్పలనాయుడు పైడిభీమవరంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లి గృహిణి. గతంలో ఆపరేషన్ చేసిన తల వెనక భాగంలో నీటి కణితి లాగా ఒక కణితి పెరుగుతూ వస్తుంది. ఈ నీటి కణితిని తొలగించుటకు దాదాపు రూ.1.5 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని కుమారుని తల్లిదండ్రులు వాపోయారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి ఆర్థికసాయం చేయాలని వారు కోరుకుంటున్నారు.



పరీక్షిస్తున్న డాక్టర్ ప్రదీప్

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఎఆర్ఎస్ క్లీనిక్, జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించి ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. డాక్టర్ టి.వి.ప్రదీప్, గాస్ట్రో ఎంట్రలోజిస్టు, లివర్ స్పెషలిస్టు వైద్య పర్యవేక్షణలో 105 మంది ఉచితంగా వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రమేష్ పరిశీలించారు. కార్యక్రమంలో జెసిఐ ప్రెసిడెంట్ కాళ్ల జైదేవ్, సెక్రటరీ డాక్టర్లు మోహన్, వెంకటేష్, వెచ్చ సంతోష్, తంగుడు షణ్ముఖరావు, వెచ్చ రాము, బి.శ్రావణ్, స్వరూప్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు మంజూరు చేయాలి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డు లేబర్ కాలనీలో గజ్జి బాలయ్య ఇంటి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు సిసి రోడ్లు మంజూరు చేయాలని కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనందరావు, గజ్జి బాలయ్య కోరారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావును బుధవారం కలిసి వినపత్రం అందజేశారు. వీధిలో పెద్దపెద్ద లారీలు వస్తున్నాయని, రోడ్లు చిన్నవిగా ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు అవుతున్నాయని అన్నారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు ఈ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మాణం అవసరమని తెలిపారు.



బ్యాటరీ సైకిల్‌ను అందజేస్తున్న ఆదిలక్ష్మి

బ్యాటరీ సైకిల్ వితరణ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో చెల్లాయివలసకు చెందిన సింహాచలం అనే దివ్యాంగుడుకి వై.బి.వలస ఎంపిటిసి మాజీ సభ్యులు, టిడిపి నాయకులు మెండ ఆదిలక్ష్మి బ్యాటరీ సైకిల్ వితరణగా బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో ఉండి దివ్యాంగులు పడుతున్న బాధలు తెలుసుకుని వారికి సహాయం చేయడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో గాతలవలస సర్పంచ్ మెండ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బోర వెంకటరమణ, కూర్మారావు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దమడి గిరిజన బాలిక ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాల స్థాయి వరకు పెంచాలని గిరిజనులు కోరుతున్నారు. పదో తరగతి పాసైన తరువాత జూనియర్ కళాశాల అందుబాటులో లేక వంద కిలోమీటర్ల దూరంలోని సీతంపేట కళాశాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడా పూర్తిస్థాయిలో విద్యార్థులకు సీట్లు లభించక వేరే ప్రాంతాల్లో ఉండి చదువుకునేందుకు వసతి సౌకర్యం లేక ఇబ్బందులు పడవలసి వస్తుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీంతో తమ పిల్లలకు కళాశాలలో సీట్లు లభించక ఇంటి వద్దనే ఉండి పోవాల్సి వస్తుందని అంటున్నారు. పెద్దమడి గిరిజన బాలికల పాఠశాలను జూనియర్ కళాశాల స్థాయికి పెంచినట్లయితే ఈ సమస్య తీరుతుందని ఐటిడిఎ అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలాస

ఉపాధి శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రధానమంత్రి ఇన్టర్న్ షిప్ ప్రోగ్రాంలో భాగంగా పదో తరగతి, పాలిటెక్నిక్, బిబిఎ, బిఎస్‌సి, ఐటిఐ, బి.ఫార్మసీ అర్హులని అన్నారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల లోపు ఉండాలన్నారు. ఈ ఇంటర్న్‌షిప్‌నకు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు వరకు స్టైఫండ్ ముందుగా చెల్లిస్తారన్నారు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి 12 నెలలు ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్నందుకు ఈ నెల 27 చివరి తేదీ అని అన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మురుగునీరుతో అవస్థలు

- ఏళ్లు గడుస్తున్నా దృష్టిసారించని అధికారులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



కాలువలు లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



బట్టుపాలెంలో ఇళ్ల ముందే నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కొత్తకోట పంచాయతీ పరిధిలోని బట్టుపాలెం గ్రామంలో 365 రోజులు వీధుల్లో ఇళ్ల ముందు మురుగునీరుతో నిత్యం ఆ బడుగుజీవులకు అవస్థలు తప్పడం లేదు. అదే పంచాయతీకి చెందిన లావేరు మండల పరిషత్ అధ్యక్షులు లుట్ట అమ్మాజమ్మ అదే సెగ్మెంట్ నుంచి ఎంపిటిసిగా గెలిపొంది ఎంపిపిగా ఎన్నికయ్యారు. సుమారు మూడేళ్లు పైబడింది. అయినా అక్కడ సమస్య ఇప్పటికీ పరిష్కారంకాక ప్రజలు దోమలు, ఈగలు, దుర్గంధంతో బాధపడుతున్నారు. నిత్యం అనారోగ్యంతో బాధలు పడుతున్నారు. మురుగునీరు ఏళ్లుగా ఇళ్ల ముందు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు విజృంభించి వారంతా రోగాలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టాలన్నా, బయటకు వెళ్లాలన్నా ఆ మురుగునీటిలో మురుగులో నుంచే వెళ్ళాలి. ఈ ఇబ్బందులు తొలగడానికి కాలువలు నిర్మాణం చేపట్టి మురుగునీరు బయటకు పోయే ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా పలుమార్లు అధికారులు ముందు మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని బట్టుపాళెం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వి.జి.కె మూర్తి ఆశయ సాధనకు కృషి



ఎచ్చెర్ల : నివాళ్లర్పిస్తున్న గోవిందరావు తదితరులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విజికె మూర్తి ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో వి.జి.కె.మూర్తి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజికె మూర్తి సిఐటియు తొలితరం నాయకులని, సిఐటియు జిల్లా ప్రథమ అధ్యక్షులుగా అనేక ఉద్యమాలు చేశారని కొనియాడారు. ఆయన తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన ఒక గొప్ప యోధుడని కొనియాడారు. 1979లో ఉద్యోగ, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులుగా అనేక ఆందోళనలు, పోరాటాలు చేశారని, తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కోసం పనిచేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శిగా సాంస్కృతి రంగంలో విశేషమైన కృషి చేశారన్నారు. విజికె మూర్తి సంతాపసభ శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎల్.రామప్పడు, చిక్కాల సత్యనారాయణ, ఎం.రమణ, సురేష్, సత్యనారాయణ, పార్థసారథి తదితరులు మాట్లాడారు.

మందస : సిపిఎం నాయకులు వి.జి.కె మూర్తి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, ఆర్.దిలీప్‌కుమార్‌లు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో పి.దేవేంద్ర అధ్యక్షతన బుధవారం



మందస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సంస్మరణ సభ నిర్వహించారు. తొలుగా విజికె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాల ఐక్యతకు కృషి చేశారని అన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి ప్రజా సాహిత్య, సంస్కృతి వ్యాప్తికి కృసి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మట్ట ధర్మారావు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు వైసిపి మండలస్థాయి సమావేశం

ప్రజాశక్తి- బూర్జ



గోవిందరావు

మండలంలోని మదనాపురంలో గురువారం వైసిపి మండలస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవింద రావు తెలిపారు. అమదాల వలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవి కుమార్ హాజరవుతున్న ఈ సమావేశానికి ఎంపిపి, జెడ్‌పిటిసితో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.



కోటబొమ్మాళి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జనవిజ్ఞాన వేదిక ఒక సైన్స్ ప్రజా ఉద్యమని, శాస్త్రీయ సమాజాన్ని, మూఢనమ్మకాలను ప్రజల్లో నిర్మూలించేందుకు కృషి చేస్తుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం డబ్బీరు గోవిందరావు అధ్యక్షతన రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల పోటీ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8,9,10వ తరగతుల విద్యార్థలను సైన్స్‌ఐ ఆశక్తి, అభిరుచి పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సంజీవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందస : పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధిపరిచే విధంగా బోధన చేయాలని, మూఢనమ్మకాలను పారదోలడానికి తగిన చైతన్యాన్ని కల్పించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, బొడ్డేపల్లి మోహనరావు, పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, ఎ.వాసుదేవరావు, పి.జగదీశ్వరరావు, ఆర్.సురేష్‌లు పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజ్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కోదండరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 23, 24 తేదీల్లో నాక్ బృందం సందర్శిస్తున్న నేపథ్యంలో అత్యవసరంగా పూర్వవిద్యార్థుల సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు విద్యార్థుల సంఘం అధ్యక్షులు అంబటి రంగారావు, కార్యదర్శి వివిఆర్ఎస్‌మూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి పూర్వవిద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, కళాశాలకు మంచి గ్రేడును సాధించడానికి నాక్ బృందాన్ని కలవనున్నట్టు తెలిపారు.

తహశీల్దార్ బదిలీ

టెక్కలి : టెక్కలి తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి బదిలీ అయ్యారు. రెండు విడతలుగా డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగం ఇచ్చే క్రమంలో దిలీప్ చక్రవర్తికి మన్యం జిల్లాకు కేటాయించారు. ఈ మేరకు ఇక్కడ నుంచి రిలీవ్ అయిన వెంటనే మన్యం జిల్లాలో డిసిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే డిసిగా బాధ్యతలు స్వీకరించినా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒఎస్‌డిగా ఉంటారనే ప్రచారం సాగుతుంది. టెక్కలి తహశీల్దార్‌గా ఇంకా ఎవ్వరినీ నియమించలేదు.

సోషల్ క్లబ్ స్థల వివాదంపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ, అధికారులు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని సోషల్ క్లబ్ స్థలంపై నెలకొన్న వివాదంపై శ్రీకాకుళం ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష బుధవారం విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 188 సర్వే నంబరు పోరంబోకు (ప్రభుత్వస్థలం) లో ఉన్న సోషల్ క్లబ్ స్థలం తమదేనంటూ ఆరుగురు వ్యక్తులు 187 సర్వేనంబరుతో పొజిషన్ ధ్రువపత్రం పొందారు. వీరినుంచి కొనుగోలు చేసి వేరొక వ్యక్తి ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని సర్పంచ్ ఆర్.లక్ష్మితో పాటు క్లబ్ ప్రతినిధులు వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్‌డిఒ సాయి ప్రత్యూష తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రెవెన్యూ, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ ఎస్‌ఎల్‌డిఆర్ రికార్డుల్లో ఈ క్లబ్ 188 సర్వేనంబరు ప్రభుత్వస్థలంలో ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ రికార్డుల్లోనూ ఈ స్థలం పంచాయతీ స్థలంగా ఉన్నటు గుర్తించారు. స్థలవివాదానికి విఆర్ఒ జారీ చేసిన పొజిషన్ ధ్రువపత్రమే కారణమని నిర్ధారణ చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా పొజిషన్ ధ్రువపత్రం జారీచేసిన విఆర్ఒ తవుడుపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ వెంకటేష్ రామానుజలకు ఆర్‌డిఒ ఆదేశించారు. పంచాయతీ రికార్డుల ఆధారంగా నివేదిక ఇవ్వాలని ఇఒ మోహన్‌బాబును ఆమె ఆదేశించారు. ఈస్థలంపై సమగ్ర సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక అందించాలని తహశీల్దార్‌కు సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయమని, నీటివనరులు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

రచనలు సమాజహితంగా ఉండాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

భాషా ప్రయోగాలు సమాజహితం కోరేవిగా ఉండాలని డా.బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వ్యవహారిక భాషోద్యమ వేత్త గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని వర్సిటీ తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన విసి మాట్లాడుతూ తెలుగుభాషకు, ప్రజల భాషకు పట్టం కట్టిన పండితుడు గిడుగు అని కొనియాడారు. వర్సిటీ ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. అనురాధ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో భాషా అధ్యయన వేత్త, కథకులు డా. అల్లంశెట్టి చంద్రశేఖరరావు, తెలుగుశాఖ అధ్యాపకులు డా.లక్ష్మణరావు, డా.కె.ఉదయకిరణ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమం అనంతరం, డా. అల్లంశెట్టి రచించిన 'గిడుగు దర్శనం' పుస్తకాన్ని విసి రజని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. యూనివర్సిటీ ఎస్ఒ డా.కె.సామ్రాజ్యలక్ష్మీ, శ్రీకాకుళ సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్, ఎన్.రమణారావు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: గిడుగురామ్మూర్తి 85వ వర్ధంతి సందర్భంగా పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నివాళ్లర్పించారు. గిడుగు



ఎచ్చెర్ల : చంద్రశేఖరరావును సన్మానిస్తున్న విసి రజని

రామ్మూర్తి వ్యవహారిక భాషావాదానికి, వ్యవహారిక భాష పితగా గుర్తించబడిన మహోన్నతమైన వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలవలస చంద్రమౌళి, దాశరెడ్డి చిరంజీవిరావు పాల్గొన్నారు.

కవిటి: గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న విలువను తెలియజెప్పిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఎఒ రాణి అన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని రామ్మూర్తి విగ్రహా లకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎస్ ఎంసి చైర్మన్ టి.మోహనరావు, ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.



వరి నాట్లు వేసిన పొలాలు

ముమ్మరంగా వరి నాట్లు

ప్రజాశక్తి- టెక్కలి

ఈ ఏడాది ఖరీఫ్ పంట వరకే సాగునీరు అందిస్తామని, రైతులు ఎవ్వరు రెండో పంట అయిన రబీకి వెళ్లవద్దని, సాగునీరు అందివ్వడం కష్టతరంగా మారుతుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వయంగా ప్రకటించారు. అయితే రైతాంగం మాత్రం రబీ పంట వైపు దృష్టి సారించారు. పండగ ముందు నుంచే రబీ పంటకు సిద్ధమయ్యారు. సాగునీరు లభ్యతపై సందేహం పడిన అన్నదాతకు మంత్రి మరలా అండగా నిలిచారు. రబీ పంటకు అవసరమైన సాగునీరు అందిస్తున్నామని ప్రకటించారు. అందుకు అనువుగా వంశధార అధికారులతో మంత్రి చర్చించారు. ఈ మేరకు రైతాంగం రబీ పంట వైపు దృష్టి పెట్టారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో రైతాంగం రబీ పంట వైపు దృష్టి పెట్టారు. గ్రామాల్లో వరినాట్లు, ఉడుపులు పనులు ఊందుకున్నాయి. దీంతో వ్యవసాయ కూలీలకు కూడా పనులు దొరుకుతుండడంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. టెక్కలి మండలంలోని తలగాం, రావివలస, టెక్కలి పంచాయతీ పరిధిలోని 737 ఎకరాలు, కోటబొమ్మాళి మండలంలో లఖీందిడ్డి, హరిశ్చంద్రపురం, ఎత్తురాళ్లపాడు పంచాయతీ పరిధిలోని వంద ఎకరాలు, సంతబొమ్మాళి మండలంలో కోటపాడు, చిన్నతుంగాం, పాలతలగాం, బోరుభద్ర, గోవిందపురం పంచాయతీ పరిధిలో 820 ఎకరాలు, నందిగాం మండలంలో నందిగాం, దేవలభద్ర, దిమిలాడ పంచాయతీ పరిధిలోని 660 ఎకరాల్లో ఉబాలు వేశారు. అయితే నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 2342 ఎకరాల్లో వరి పంట వేశారు. మరో 750 ఎకరాల పైచిలుకు రబీకి సిద్ధం కావచ్చునని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, రబీ పంటకు నీరందివ్వలేమని ముందుగా ప్రకటించడంతో చాలామంది రైతులు అపరాల పంటలైన మినుము, పెసర పంటలపై దృష్టి పెట్టారు. నియోజకవర్గ పరిధిలో 10,700 ఎకరాల్లో మినుము, 7452 ఎకరాల్లో పెసర పంటలు వేశారు. 5145 ఎకరాల్లో వేరుశనగ పంటలు వేయగా, 957 ఎకరాల్లో మాత్రమే రాగులు పండిస్తున్నారు.

యాంత్రీకరణతో ఖర్చులు తగ్గుదల



ఆమదాలవలస : అపరాల పంటను పరిశీలిస్తున్న ఎఒ, సర్పంచ్

ప్రజాశక్తి- కవిటి

రోజు రోజుకీ సాగులో పెరిగిపోతున్న ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణ తప్పనిసరని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు అన్నారు. మండలంలోని రాజపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పురుగు మందులు పిచికారీ చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్ సదుపాయం కల్పిస్తోందన్నారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పిఎం కిసాన్‌కు సంబంధించి 2019 ఫిబ్రవరి 1న ఒన్ బి, అడంగల్ ఉన్న రైతు సోదరులు తమ తమ పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అనంతరం రైతులకు పాడిపంటల నెలవారి చందా పుస్తకాలను అందించారు. ఎఒ బడగల దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకుడు గణపతి, రైతులు పుల్లట సంతోష్, కామేశ్వరరావు, పైల పాపారావు, ఇసురు మోహనరావు, ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రబీ సీజన్‌లో సాగుచేసే పంటల సస్యరక్షణపై రైతులకు పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధు అవగాహన కల్పించారు. మండలంలోని దేవునల్తాడలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రబీ కాలంలో సాగుచేసే అపరాలు, రాగి, వేరుశనగ, వరి పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలను ఆశించు పురుగులు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు.



కవిటి : మాట్లాడుతున్న జగన్మోహనరావు

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురంలో రబీలో రైతులు సాగుచేస్తున్న వేరుశెనగ పంటపై ఎఒ ఎస్.గోవిందరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్.పవిత్ర పాల్గొన్నారు.

ఆమదాలవలస: సస్యరక్షణతో అపరాల పంటల్లో అధిక దిగుబడిని సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని చీమలవలస రైతుసేవా కేంద్రంలో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సనపల చెల్లంనాయుడు, ఎఇఒ రమణ, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ గౌతమి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు పలాస జిఆర్‌పి హరినాథ్ బుధవారం తెలిపారు. అతను వయసు సుమారుగా 40 ఏళ్లు ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే ఫోన్ నంబరు 9440627567ను సంప్రదించాలన్నారు. మృతుని ఎడమ చేయిపైన మీటా అనే టాటూ మార్క్, ఎడమ పక్క గుండె పైన పాము గుర్తు టాటో ఉందని అన్నారు. కుడి పక్క గుండెపైన సిలువ గుర్తు, భాను అనే పేరు ఉందని తెలిపారు.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని లెప్రసీ కాలనీకి చెందిన షేక్ శ్రీనివాసరావు (49) ప్రధాన రహదారిపై శివాలయం వద్ద నున్న ఆర్‌టిసి బస్‌స్టాప్ వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని మృతుని కుమారుడు షేక్ జోసఫ్ అనుమానాస్పద మృతిగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దేవాలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడని తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ సనపల బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- లావేరు



గాయపడ్డ మహేష్

మండలంలోని మురపాక, అల్లినగరం కూడలి సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం బొలేరో వాహనం ఢీకొనడంతో దిచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో అప్పాపురం మాజీ సర్పంచ్, టిడిపి తెలుగుయువత మండల అధ్యక్షుడు గంట్యాడ మహేష్, అదే గ్రామానికి చెందిన రెడ్డి శంకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరికి ఎడమ కాళ్లు రెండు చోట్ల విరిగిపోయాయి. వీరిద్దరూ అప్పాపురం నుంచి ఎచ్చెర్ల మండలంలోని తోటపాళెంలో ఎచ్చెర్ల జనసేన నాయకులు విశ్వక్సేన్ తల్లి ఇటీవల మృతిచెందడంతో పరామర్శకు వెళు _న్నారు. అల్లినగరం కూడలి సమీపంలోకి వెళ్లేసరికి వెనుకనుంచి వస్తున్న బొలోరో వాహనం దిచ్రక వాహనాన్ని ఢీకొనడంతో వీరు ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి తుళ్లిపోవడంతో కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెనుకనుంచి వస్తున్న అదే గ్రామానికి చెందిన బాసిన దాలిరాజు వెంటనే 108 వాహనంలో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించగా మహేష్‌కు మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

గూడ్స్ రైలు ఢీకొని ఆవులు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస



మృతి చెందిన ఆవు

మండలంలోని దూసి రైల్వేగేట్ సమీపంలో బుధవారం గూడ్స్ రైలు ఢీకొని రెండు ఆవులు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు దూసిపేటకు చెందిన దవళ యతిరాజులు సాయంత్రం పశువులను మేతకు తీసుకొని వెళ్లగా ఇంతలో మేత మేసుకుంటూ ఆవులు రైల్వేగేట్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళు _న్న గూడ్స్ రైలు ఢీ కొంది. తీవ్ర గాయాలతో సుదూర ప్రాంతానికి తుళ్లిపోయిన రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.రెండు లక్షల విలువ చేసే ఆవులు తన కళ్లెదుటే మృతి చెందా యని, ఆవుపాలతో జీవనోపాధి పొందు తున్నానని రైతు యతిరాజులు కన్నీరు మున్నీరుగా రోధించాడు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జెడ్‌పిటిసి యశోద, జోగారావు

కళ్యాణ మండపం నిర్మాణాన్ని అడ్డుకోండి

సోంపేట: పట్టణ శివార్లలోని బిరుసువాడ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపం పనులను ఆపివేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని స్థానిక జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపం పనులను ఇటీవల పున: ప్రారంభించడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిగిందని విలేకరులకు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణం వల్ల ప్రాణనష్టాలు జరిగే అవకాశం ఉందని అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. వెంటనే పనులు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కమ్మసిగడాం జాతర పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం రూరల్ : ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో నిర్వహించే కమ్మ సిగడాం శ్రీమహాలక్ష్మి తల్లి జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయకమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీసభ్యులు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మంగళవారం ఉదయం 11 గంటలకు పెళ్ళిరాట వేయటం జరుగుతుందన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వ్యాపారులు ముందస్తుగా వచ్చి స్థలాలు బాగు చేసు కోవాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఒడిశా నుంచి యాత్రికులు తరలివస్తారని, ఆలయ కమిటీ జాతరకు పూర్తి ఏర్పాట్లు చేసిందని, పోలీసుశాఖ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, సూర్యతేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్, సింహాచల రాయుడు, వి.జె. ఎస్.ఎల్.పి.మౌళి, గురాల రఘునాథ్, మన్నె వరహ మూర్తి, కృష్ణారావు, నడుకుదిటి గిరి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కమిటీ సభ్యులు

పాడి పశువులతో ఆదాయం


ఆమదాలవలస : మందులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- జలుమూరు

పాడి పశువుల వల్ల నిత్య ఆదాయమని, అందుకు ఉచిత పశువైద్య శిభిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని లింగాలవలసలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యాన బుధవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. రైతులకు పశువుల వ్యాధులకు కావాల్సిన వైద్యం అందించే నిమిత్తం ఈ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి కె.రాజగోపాల్, జయరాజ్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండిలో పశువైద్యాధికారి మెట్ట పాపారావు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకుడు వంక రామారావు, గోవిందపురం పశు వైద్యాధికారి రాజ్‌కిరణ్, సిబ్బంది భగవతీ, అఖిల్, నాగయ్య, తులసీరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం, కొత్తపల్లి గ్రామాల్లో పశు వైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్యలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 36 గొర్రెలకు, 21 మేకలకు నట్టల నివారణ మందులు, 644 గొర్రెలకు, 114 మేకలకు అమ్మవారు టీకాలు, 256 కోళ్లల్లో కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు జెవిఒలు లక్ష్మీనరసమ్మ, పద్మ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడులో సర్పంచ్ ప్రతినిధి అట్టాడ రాంప్రసాద్, మండల పశు వైద్యాధికారి కె.అప్పలసూరి ఆధ్వర్యాన పశువైద్యశిపురం నిర్వహించారు. 14 పశువులకు చూడు పరీక్షలు, 21 దూడలకు నత్తల నివారణ మందులు, 18 గర్భకోస వ్యాధి నివారణ చికిత్సలు, 35 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించారు.

మందస : మండలంలోని కొత్తపల్లి, లోహరిబంద గ్రామాల్లో హరిపురం పశు వైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి కోరికన వల్లభరావు, మార్పు మాధవరావు, మార్పు సత్యనారాయణ, దివాకర్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రభుత్వం పశు సంవర్ధకశాఖ ద్వారా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు అన్నారు. బుధవారం పురపాలక సంఘంలోని 21వ వార్డు పరిధి కుద్దిరాంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, లేగ దూడలకు ఏలిక పాముల నివారణకు మందులు, వ్యాధి నిరోధక టీకాలు, పశు పోషకులకు శాస్త్రీయ పశుయాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పశు పోషకులకు మందులను పంపిణీ చేశారు. శిబిరంలో మాజీ కౌన్సిలర్ పొన్నాడ ఆదినారాయణ, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ స్వాతి, అటెండర్ ఉమామహేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ సుమతి, పశుసంచార పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందుకుంటున్న ఎస్‌పి తల్లిదండ్రులు

‘కొత్తమ్మతల్లి’ సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తల్లిదండ్రులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవాదాయశాఖ ఆలయ కార్యనిర్వాహణాదికారి వాకచర్ల రాధాకృష్ణ, స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణలు స్వాగతం పలిపాకరు. పురోహితులు సుసరాపు లక్ష్మీకాంతం శర్మలు పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తమ్మతల్లి విశిష్టతను వివరించారు.

ఒడియా పాఠశాలల విలీనం వద్దు

కవిట: రాష్ట్ర ప్రభుత్వం జిఒ 117 రద్దు చేసిన తరువాత పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని ఒడియా మాధ్యమం, ఒడియా సెక్షన్ గల బైలింగ్వల్ పాఠశాలలను తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో విలీనం చేయొద్దని ఎపి ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కరపాడి, బృందావన్ దోళాయి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బైలింగ్వల్ మోడల్ ప్రైమేరీ పాఠశాల, బేసిక్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో ఒడియా మాధ్యమం ఉపాధ్యాయులను ఇప్పటిలాగే కేటాయించి ఒడియా మాధ్యమం కొనసాగించాలని కోరారు. ముఖ్యంగా మూడు కిలోమీటర్ల పరిధిలో ఒడియా మాధ్యమం ఉన్నత పాఠశాలలు లేని ప్రాథమికోన్నత పాఠశాలలు యథావిథిగా కొనసాగించాలని కోరారు. ఒడియా పాఠశాలలను ఇతర పాఠశాలలో విలీన ప్రతిపాదన విరమిస్తూ, 35 మంది విద్యార్థులున్న ఒడియా ప్రాథమిక పాఠశాలలను మోడల్ ఒడియా ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

కవిటి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో బహుజన ఉపాధ్యాయ సంఘం కృషి శ్లాఘనీయమని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్‌సి వద్ద బహుజన ఉపాధ్యాయ సంఘ కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిటిఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామారావు, మండలం అధ్యక్షుడు హరిబాబు, కార్యదర్శి బి.చలపతి పాల్గొన్నారు.

డ్యూటీ ధ్రువపత్రాలు అందజేయాలి

టెక్కలి : పాతపట్నం నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి డ్యూటీ ధ్రువపత్రాలు అందజేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు తమ్మినేని చందనరావు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని బుధవారం కలిపి వినతిపత్రం అందజేశారు. తమ సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసుకున్న కారణంగా ధ్రువపత్రాలను అందజేయాలని కోరారు. ఈయనతో పాటు కె.కె.రామిరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకం


మాట్లాడుతున్న ఎస్.వి రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిఒ 117 రద్దు సవరణలు పేరిట విడుదల చేసిన మెమో లోపభూయిష్టంగా ఉందని, ప్రభుత్వ విద్యావ్యవస్థ ఉనికికే ప్రశార్థకంగా మారుతోందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో బుధవారం ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117ను రద్దు చేస్తూనే సవరణల మెమో అంటూ మరిన్ని మార్పులు చేస్తున్నారన్నారు. ఈ మార్పుల వల్ల విద్యావ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకం అవుతుందన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ సవరణల మెమోలో ఉన్నత పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలలో తిరిగి చేర్చడం మంచి పరిణామమే అయినా 60 మంది విద్యార్థులున్న 3, 4, 5, తరగతులను సమీప పాఠశాలల నుంచి మోడల్ పాఠశాలలో విలీనం చేస్తామనడం సరికాదన్నారు. అలాగే 6, 7, 8 తరగతిలో 50 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్‌గా ఉన్నతీకరణ చేయాలన్నారు. 50 మంది విద్యార్థులు లేని ప్రాథమికోన్నత పాఠశాలలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సెక్షన్ వారీగా కాకుండా రోల్ ప్రాతిపదికన పోస్టులు మంజూరు చేయాలన్నారు. సమీప పాఠశాలల్లో విలీనం జరిగితే ఉన్న విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోయే ప్రమాదముందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎన్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎం.తేజేశ్వరరావు, కె. గడ్డెన్నాయుడు, మహిళా కార్యదర్శి వసంత కుమారి పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి- పొందూరు

వాహనాల డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని భాష్యం స్కూల్ వద్ద బుధవారం స్కూల్ బస్సుల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల బస్సులు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పరిశీలించడంతో పాటు, విద్యార్థులకు పలు జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. బస్సు వేగంలో నియంత్రణను పాటించాలని పేర్కొన్నారు. ఈయనతో పాటు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.


డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ


ఎంఇఒను అభినందిస్తున్న ఎంఆర్‌సి సిబ్బంది

ఎంఇఒ శ్రీరాములు బాధ్యతల స్వీకరణ

పొందూరు: మండల విద్యాశాఖాధికారి-1గా జి.శ్రీరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఉన్న శ్రీరాములుకు ఎంఇఒ-1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఎంఇఒ-1గా పనిచేసిన రాజేంద్రప్రసాద్‌ను బదిలీ చేశారు. డిసిఇబి సెక్రటరీగా ఉన్న రాజేంద్రప్రసాద్‌ను ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక బాధ్యత మాత్రమే నిర్వహించాలన్న నిబంధనతో తిరిగి డిసిఇబి సెక్రటరీగా వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన శ్రీరాములను ఎంఇఒ-2 రాజారావు, ఎంఆర్‌సి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఎఐవైఎఫ్ నూతన అధ్యక్షునిగా సంతోష్


సంతోష్

శ్రీకాకుళం అర్బన్: అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షునిగా బొత్స సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కొన్న శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. నగరంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన ఎఐవైఎఫ్ జిల్లా మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెండో రోజు బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మహాసభలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ హాజరై ఎన్నికలను నిర్వహించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా సిహెచ్ రవి, వాసుదేవరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోరు వాసు, సహాయ కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా కిరణ్‌లు ఎన్నికయ్యారు.


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

పోషకాహారాన్ని అందించాలి

ప్రజాశక్తి- లావేరు

అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదేశించారు. బుధవారం తాళ్లవలస పంచాయతీ రావివలస అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కార్యకర్త సంతోషికుమారి పద్యాలు చెప్పించి వాటికి అర్థాలను పిల్లలతో చెప్పించారు. అనంతరం ఎమ్మెల్యే కేంద్రంలోని పిల్లలు, సిబ్బంది హాజరుపట్టిని పరిశీలించి సంతృప్తి చెందారు. కేంద్రంల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, చిన్నవయసు నుంచే సరైన ఎదుగుదల ఉండేలా ప్రత్యేకంగా చొరవ చూపాలని కార్యకర్తకు సూచించారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్ ప్రసాద్‌రెడ్డి

బాహుదా వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం బాహుదా నదిపై ఉన్న రోడ్డు వంతెన కూలిపోయి స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ శాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఆర్అండ్‌బి చీఫ్ ఇంజినీర్ నాయిముల్లను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాహుదా రోడ్డు వంతెన, నియోజకవర్గంలోని శిథిలావస్థలో ఉన్న ఆర్అండ్‌బి రోడ్ల దుస్థితిని వివరించారు. ఎస్.ఆకారపు రోడ్డు మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు.

నేడు ఎంఐజి లేఅవుట్ ప్లాట్ల సర్దుబాటు

పలాస : పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం ఎన్‌టిఆర్ హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా బొడ్డపాడు లేఅవుట్‌లో ఎంఐజి ఫేజ్-1కు సంబంధించి గురువారం ఉదయం 10 గంటలకు ప్లాట్ల నంబర్లను డ్రా తీసి ప్లాట్లు సర్దుబాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, కలెక్టర్, జెసి, సుడా చైర్మన్ పాల్గొంటారని అన్నారు. దరఖాస్తు దారులు పాల్గొని డ్రా ద్వారా ప్లాట్లను పొందాలని కోరారు.

క్రీడాకారులకు శిక్షణ

పలాస: జాతీయ టెన్నికాయట్ పోటీలకు రాష్ట్ర జట్టుకు పలాసలో శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర టెన్నికాయట్ అసోసియేషన్ కార్యదర్శి పి.తవిటయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడాకారులకు తర్ఫీదు ఇవ్వడంతో పాటు పోటీల్లో పాల్గొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్ కుమార్, కార్యదర్శి ఎస్.వి.జోగారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, మైదానం అభివృద్ధి కమిటీసభ్యులు ఎం.భద్రయ్య, జె.మల్లేశ్వరరావు, టంకాల రవిశంకర్ గుప్తా, కె.తారక్, కె.శంకరరావు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు